ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024 1
అనంతపురం శ్రీ సత్యసాయి

అనంతపురంలో ఓటువేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు దీరిన ఓటర్లు

ఓటరోత్సాహం..!

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన పోలింగ్
- ఉదయం 7 గంటలకే క్యూలైన్లలో బారులుదీరిన ఓటర్లు
- రాత్రి 9 గంటల వరకు కొనసాగిన పోలింగ్
- తాడిపత్రి, రాప్తాడు, హిందూపురం నియోజకవర్గాల్లో ఘర్షణలు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరోత్సాహం కన్పించింది. అన్ని నియోజకవర్గాల్లనూ ఉదయం 7 గంటలకే పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లలో నిల్చున్నారు. రాత్రి 9 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. యువకులు, వృద్ధులు, మహిళలు ఓటేసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు. ఏ పోలింగ్ కేంద్రం చూసిన బారులుదీరిన ఓటర్లతో క్యూలైన్లు కన్పించాయి. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం వీల్‌చైర్లో వచ్చి ఓటు వేశారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీయువకులు అయితే ఓటేసేందుకు పెద్దఎత్తున ఆసక్తి కనబరిచారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు రావడంతో గంటల తరబడి ఓటర్లు క్యూలైన్లలో నిల్చోవాల్సి వచ్చింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకుండా పోలీసులు, అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. రెండు జిల్లాల కలెక్టర్లతో పాటు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల సంగ్రామంలో అత్యంత కీలకమైన పోలింగ్ ముగియడంతో ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయి. తాడిపత్రిలోనూ, మరికొన్ని చోట్ల చెదురు మదరు ఘటనలు మినహా అంతటా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. వాతావరణం అనకూలంగా మారి ఎండ వేడిమి లేకుండా మేఘాలు కమ్ముకుని తేలికపాటి వర్షం పడటంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులుదీరి నిలబడ్డారు. కొన్ని ఇవిఎంలు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్రారంభంలో కొంత సమస్య నెలకొంది. ఎక్కడా సాంకేతిక సమస్యతో ఓటింగ్ ఆగిన దాఖలాల్లేవు. అనంతపురం జిల్లాలో 76.54 శాతం పోలింగ్ జరిగింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ స్థానం కలిపి మొత్తం 20,18,162 ఓట్లు ఉన్నాయి. ఇందులో రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగిన పోలింగ్ సమాచారం మేరకు 76.54 శాతం ఓటింగ్ జరిగింది. అంటే 15,44,827 ఓట్లు పోలయ్యాయి. ఇంకా పూర్తి స్థాయి సమాచారం అందాల్సి ఉంది.

అనంతపురం జెఎన్‌టియులో స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాత్రి 8 గంటల వరకు అనంతపురం జిల్లాలో నమోదైన పోలింగ్ శాతం

నియోజక వర్గం	పోలింగు శాతం
రాయదుర్గం	77.6
ఉరవకొండ	80.4
గుంతకల్లు	71.56
తాడిపత్రి	77.58
శింగనమల	80.13
అనంతపురం	64.3
కళ్యాణదుర్గం	79.4
రాప్తాడు	81.4
మొత్తం	**76.54**

రాత్రి 8 గంటల వరకు శ్రీ సత్యసాయి జిల్లాలో నమోదైన పోలింగ్ శాతం

నియోజక వర్గం	పోలింగు శాతం
మడకశిర	74.25
హిందూపురం	73.32
పెనుకొండ	78.77
పుట్టపర్తి	75.22
ధర్మవరం	76.10
కదిరి	72.24
మొత్తం	**74.98**

తాడిపత్రిలో ఉద్రిక్తత

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బోడాయపల్లిలో ఉదయం ఇవిఎం వద్ద తలెత్తిన సమస్యతో ఇరువర్గాలు ఘర్షణపడ్డారు. ఇది పోలీసులు సద్దుమణిచేలోపు తాడిపత్రి పట్టణంలో ఓంశాంతినగర్‌లో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలు ఒకేసారి అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. అదుపు చేయడానికి పోలీసులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అక్కడి నుంచి మరోమారు టైలర్స్ కాలనీలోనూ ఇద్దరు

మిగతా 3లో

'దొంగే దొంగ' అన్నట్లుంది : విశ్వ 2లో..
అరాచక పాలనకు చరమగీతం: కాలవ 7లో..
కిరికెరలో ఎన్నికల బహిష్కరణ 7లో..

తాడిపత్రిలో ఉద్రిక్తం..!

- టిడిపి, వైసిపి నాయకుల రాళ్లదాడులు
- ఎమ్మెల్యే పెద్దారెడ్డి మూడు వాహనాలు ధ్వంసం
- ఎమ్మెల్యే, తనయుడు హర్ష వర్ధన్‌తో పాటు ఉన్న ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి తాడిపత్రి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సమస్యాత్మక నియోజకవర్గంలో ఒకటైన తాడిపత్రి నియోజకవర్గంలో పోలింగ్ వేళ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. టిడిపి, వైసిపి నేతల మధ్య రాళ్ల దాడి జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుంటూ పోలింగ్ కేంద్రం వద్ద భయానక పరిస్థితిని తెచ్చారు.దీంతో తాడిపత్రిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. అయితే పోలీసులు స్పందించి రెండు వర్గాలను చెరదగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

తాడిపత్రి పట్టణ పరిధిలోని ఓంశాంతి నగర్‌లో పోలింగ్ జరుగుతుండగా ఉదయం 11 గంటల సమయంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య వివాదం మొదలైంది. ఓంశాంతి నగర్‌లోని పోలింగ్ బూత్‌లో టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్ రెడ్డి అక్కడికి వచ్చారు. ఆయన వాహనాలు రాగానే

రాళ్లదాడిలో ధ్వంస అయిన కారు

మిగతా 3లో

నార్పల, పెద్దవడుగూరులో క్యూలైన్‌లో ఓటేసేందుకు వెళ్తున్న ఓటర్లు

నార్పల, శింగనమలలో ఓటేసేందుకు వెళ్తున్న వృద్ధులు

ఓటేసేందుకు వీల్‌ఛైర్‌లో వస్తున్న వృద్ధుడు

పోలింగ్ ప్రశాంతం

జిల్లావ్యాప్తంగా ఓటింగ్‌కు పోటెత్తిన జనం-ఉదయం నుంచే బారులు

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు మండలంలో 25 పంచాయతీల పరిధిలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికలు చెదురు బెదురు ఘటనలు మినహా ఎన్నికలు సజావుగా జరిగాయి. కసాపురం గ్రామంలో ఒకే వ్యక్తి వివో ప్యాట్ వద్దకు వికలాంగులు, వృద్ధులను తీసుకొచ్చి ఓటు వేయించడం ఆగ్రహించిన ఏజెంట్లు వాగ్వాదానికి దిగారు. బయట ఉన్న వైసిపి నాయకులు గుంపు కావడంతో పోలీసులు వారిపై స్వల్పంగా లాఠీతో దాడి చేశారు. అదేవిధంగా కొంగనపల్లి గ్రామంలో ఇరుపార్టీ వర్గాలు పోలింగ్‌స్టేషన్ వద్ద గుమగుడడంతో వాగ్వివాదం చోటు చేసుకోగా పోలీసులు జోక్యం చేసుకుని సద్దుమణిగించారు. కాగా గుంతకల్లు మండలంలో విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ శివప్రసాద్ దంపతులు అమెరికా నుంచి వచ్చి అమిన్‌పల్లి గ్రామంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఒక్కొక్కరికి రూ.4.50 లక్షలు ఖర్చు పెట్టి వచ్చినట్లు ఎన్ఆర్ఐ తెలిపారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన సింగపూర్ ఎన్నారైలు మల్లికార్జున దంపతులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగసముద్రం గ్రామంలో పోలీసులు క్యూలైన్లు అదుపు చేయకపోవడం వల్ల ఓటర్ల మధ్య తోపులాట జరిగింది. వైటీ చెరువు గ్రామంలో వసతులు ఏర్పాటు చేయకపోవడం వల్ల 20800 మంది ఓటర్లు ఉన్న గ్రామానికి కేవలం రెండే బూతులు కేటాయించడం ద్వారా ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకపోతే నియోజకవర్గంలో ఓటర్లు 2,70,648 మంది ఉండగా సాయంత్రం 5 గంటల వరకూ 1,71,549 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకూ ఓటింగ్ కొనసాగింది.

శింగనమల : నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు బారులుదీరి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం పూర్తయ్యే సరికి 80.13 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు.

పెద్దపప్పూరు : చెదురుముదురు ఘటనలు మినహా మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. మండలంలోని వరదాయపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్తల రాళ్ల దాడిలో ముగ్గురు టిడిపి నాయకులు గాయపడ్డారు. పెద్దపప్పూరు, అమ్మలదిన్నెలో కూడా చిన్న చిన్న ఘటనలు మినహా మండల వ్యాప్తంగా ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి.

నార్పల : నార్పల మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల పంచాయితీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, అయ్యప్ప ఆలయం వెనుక ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పోలింగ్ సజావుగా సాగింది. సాయంత్రం ఐదు గంటల సమయానికి నార్పల మండలం వ్యాప్తంగా 74 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. సీఐ శ్రీధర్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఓ రాముడు, తదితరులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండల పరిధిలోని కేసేపల్లి గ్రామంలో కొద్దిసేపు ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే అక్కడికి చేరుకున్న అధికారులు టెక్నీషియన్ ద్వారా పరిశీలించారు. అయితే ఇవిఎంలో ఎలాంటి సమస్య లేదని, సిబ్బంది అవగాహన రాహిత్యంతో సమస్య ఏర్పడిందని వెంటనే పరిష్కరించారు. వికలాంగులు ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌ఛైర్లు ఏర్పాటు చేశారు. కాగా పలు పోలింగ్ కేంద్రాలను ట్రైనీ ఐపీఎస్ అధికారులు ప్రశాంత్‌రాజ్, మాధవ్ ఉపాధ్యా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇకపోతే పలువురు ప్రముఖులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, నార్పల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచి స్వాతిలత దంపతులు ఓటు వేశారు. అలాగే తొలిఓటు వేసిన యువతీ, యువకుల ఆనందోత్సవాలకు అవధుల్లేకుండా పోయాయి. కాగా మండల కేంద్రంలోని బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను ట్రైనింగ్ ఐపీఎస్ అధికారులు ప్రశాంత్‌కుమార్ మాధవ్ ఉపాధ్య పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. దీంతో వైసిపి, టిడిపి నేతలు ఆనందంలో ఉండిపోయారు. అలాగే మండలం పరిధిలోని సొంత గ్రామం బొందలవాడలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా మండలవ్యాప్తంగా 82.34 శాతం పోలింగ్ నమోదైనట్లు పోలింగ్ సిబ్బంది తెలిపారు.

బుక్కరాయసముద్రం : మండల వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సోమవారం ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గంలో స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో క్యూలైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉరవకొండ మండలం వై.రాపురం గ్రామంలో స్వల్ప సంఘటన వల్ల కొద్దిసేపు పోలింగ్ ఆగిపోయింది ఈ సంఘటన తెలుసుకున్న వైసీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఇద్దరూ కూడా గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసులు శాంతింపజేసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ఉరవకొండలో వైసిపి టిడిపి ఇరువర్గాలు అక్కడక్కడ స్వల్ప ఘర్షణకు దిగారు. విడపనకల్ మండల పరిధిలోని హావలిగి, విడపనకల్, ఆర్.కొట్టాల గ్రామాలలో కొన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఈవీఎంల వద్దకు వెళ్లిన ఓటర్లకు వెలుతురు లేకపోవడం వల్ల అనేకమంది ఇబ్బందులకు గురయ్యారు. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామంలో టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి వై విశ్వేశ్వర్ రెడ్డి రాకెట్ల గ్రామంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి కూడా రాకెట్ల గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇకపోతే విడపనకల్ మండలవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. వివిధ గ్రామాల్లో గతంలో కంటే పోలింగ్ నమోదు శాతం గణనీయంగా పెరిగింది. ఇందులో భాగంగా విడపనకల్ ఎంపిపి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మొదటి ఓటు సంతోషం

అనంతపురం : జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ కుటుంబ సమేతంగా నగరంలోని రామ్‌నగర్‌లోని మదర్‌థెరిస్సా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా టిసి.వరుణ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ఓటుహక్కు అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట నగర అధ్యక్షులు పొదిలి బాబురావు ఉన్నారు. కాగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మురళీధర్ కూడా ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పుట్లూరు : మండల వ్యాప్తంగా 81.54 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దార్ మల్లికార్జునస్వామి తెలిపారు. అంతకుముందు ఇండియా కూటమి అభ్యర్థి సాకే శైలజనాథ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓబుళాపురం గ్రామంలో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో నలుగురికి గాయాలయ్యాయి.

పెద్దవడుగూరు : మండల వ్యాప్తంగా 46 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక పోలింగ్ స్వల్ప ఉద్రిక్తతల నడుమ సాగింది. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ సజావుగా జరిగింది. అయితే బందార్లపల్లి, కాశేపల్లి, దిమ్మగుడి, క్రిష్టిపాడు, పెద్దవడుగూరు గ్రామాల్లో రెండుపార్టీల వ్యక్తులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలియడంతో సీఐ రోషన్, ఎస్సై ముత్యాలశ్రీనివాసులు, పోలీసు సిబ్బందితో రంగప్రవేశం చేసి రెండువర్గాలను చెదరగొట్టి సజావుగా సాగేందుకు కృషిచేశారు. బందార్లపల్లిలో కొందరు వైసిపికి చెందిన వ్యక్తులు దొంగఓట్లు వేయాలని ప్రయత్నం చేయగా టిడిపి నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు గొడవకు దిగారు. దీంతో పోలీసులు వెళ్లి రెండువర్గాలను సర్దిజెప్పి సమస్య లేకుండా పోలీసులు జోక్యంతో సమస్య లేకుండా చేశారు.

పుట్లూరు మండలంలో బారులుదీరిన ఓటర్లు

'దొంగే దొంగ' అన్నట్లుంది పయ్యావుల కేశవ్ తీరు

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పయ్యావుల కేశవ్ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడంతోపాటు దౌర్జన్యాలకు పాల్పడుతూ వైసిపి అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని చెప్పడం 'దొంగే దొంగ' అన్నట్లుగా ఉందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం మండలంలోని రాకెట్ల గ్రామంలో వై.విశ్వేశ్వరరెడ్డి, సతీమణి భువనేశ్వరి, తనయుడు ప్రణయ్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో నిన్న రాత్రి నుంచి వర్షం కురవడం, ఎండ లేకపోవడం వల్ల వెలుతురు సరిగా లేదన్నారు. దీంతో ఇవిఎంల వద్ద గుర్తు సరిగా కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. అలాంటి ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ వై.రాంపురం గ్రామంలో పోలింగ్ ఏజెంట్‌గా ఓ మర్డర్ కేసులో ముద్దాయిని కూర్చోబెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. బెదిరింపు ధోరణి వల్ల వైసిపి వారు అభ్యంతరం తెలపడంతో ఆ కేంద్రంలో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయిందన్నారు. మర్డర్ కేసులో ముద్దాయిలను ఎవరైనా ఏజెంట్లుగా పెడతారా.. అని నిలదీశారు. ఎప్పుడు తాను తప్పుడు పనులు చేస్తూ ఇతరులపై ఆరోపణలు చేయడం కేశవ్ నైజం అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఎవరికి ఓటు వేస్తున్నామో తెలుస్తోందని భయపెడుతున్నారన్నారు. ఉదయం నుంచే ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివస్తుండడంతో ఓర్చుకోలేక బెదిరింపులకు పాల్పడుతున్నాడని విమర్శించారు. అధికారులను కూడా సస్పెండ్ అవుతారని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. ఆయన ఎన్ని కుట్రలు చేసినా నియోజకవర్గంలో వైసిపి విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కౌకుంట్ల, వై.రాంపురం, రాచేపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను

ఆటో ఢీ.. వ్యక్తి మృతి

గుమ్మగట్ట : మండల మండలంలోని 75 వీరాపురం గ్రామానికి చెందిన రాజు (28)ను ఆటో ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాజు సోమవారం ఉదయం నుంచి గ్రామంలో అందరితో సరదాగా గడిపి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అయితే సాయంత్రం 7 గంటలకు భార్య, ఐదేళ్ల కుమారుడిని తీసుకుని మోటార్ సైకిల్‌పై రాయదుర్గానికి వెళ్తుండగా గౌడ లేఅవుట్ వద్దకు రాగానే వెంకటంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి టాటా ఏస్ ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

టిడిపి వర్గీయులపై వైసిపి నాయకుల దాడి

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద టిడిపి వర్గీయులపై వైసిపి నాయకులు దాడి చేశారు. గ్రామానికి చెందిన టిడిపి వర్గీయుడు శంకరయ్యగౌడ్ అనారోగ్య కారణంగా ఓటు వేయడానికి అతని కుమారులు నవీన్‌కుమార్‌గౌడ్, పవన్‌కుమార్‌గౌడ్ పోలింగ్ బూత్ వద్దకు తీసుకెళ్లారు. ఓటర్ల క్యూ అధికంగా ఉండటంతో పోలీసుల అనుమతితో అతన్ని లోనికి తీసుకెళ్తుండగా వైసిపి నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఒకరినొకరు వాదించుకుని ఘర్షణకు దిగారు. టిడిపి వర్గీయులు నవీన్ కుమార్‌గౌడ్, పవన్ కుమార్ గౌడ్ పై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. అక్కడి నుంచి వారిద్దరు ఇంటికి వెళ్లారు. అయితే వైసిపి నాయకులు వారి ఇంటిలోకి చొరబడి నవీన్ కుమార్ గౌడ్, పవన్ కుమార్ గౌడ్ పై మరోసారి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడి సమయంలో జరిగిన తోపులాటలో వైసిపి నాయకుడు కేశవరెడ్డి కింద పడి గాయపడ్డాడు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, టిడిపి నాయకులు ఎంకె.చౌదరి, పి.రవితేజ, పి.నారాయణస్వామి, జక్కలచెరువు గోవిందు, తదితరులు గాయపడ్డ టిడిపి వర్గీయులను పరామర్శించారు.

సత్యసాయి జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో చెదురు ముదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అయ్యింది. ఓటర్ల పెద్ద సంఖ్యలో రావడంతో రాత్రి 7 గంటల తర్వాత కూడా పోలింగ్ జరిగింది. రాత్రి 7-30 గంటల సమయానికి జిల్లాలో 74.70.శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్ బాబుతో పాటు ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. వీరు కాక ఎన్నికల పరిశీలకులు నియోజకవర్గ కేంద్రాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. సాయంత్రం ఐదు గంటలకు అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం పెరిగింది.

కదిరిలో ప్రశాంతం..

కదిరి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తలరాతలను ఓటర్లు మే 13వ తేదీ సోమవారం ఈవీఎం బాక్స్ లలో భద్రపరిచారు. కదిరి నియోజకవర్గంలోని కొన్ని మండలాలలో రాత్రి ఎనిమిది గంటలైనా పోలింగ్ కొనసాగింది. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆయన పరిశీలించారు. అమతవల్లి పోలింగ్ కేంద్రంలో ఆయన భార్యతో కలిసి ఓటు వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్ అహ్మద్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కదిరి పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద వాలంటర్లు హల్‌చల్ చేశారు. వాలంటర్లీ పరిధిలోని ఉన్న ఓటర్లను వారు ప్రలోభాలను పెడుతుండడంతో టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. కదిరి మున్సిపాల్టీ పరిధిలోని కుట్టాగుల పోలింగ్ కేంద్రం వద్ద కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తలుపుల మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో క్యూ లైన్‌లో ఉన్న వారిని ఓట్లు వేయించేందుకు రాత్రి పది గంటల వరకు కూడా సమయం ఇచ్చి ఓట్లు వేయించారు. డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధర్మవరంలో చెదురుమదురు ఘటనలు మినహా...

ధర్మవరం టౌన్ : ధర్మవరం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6గంటలకే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండ వేడిమికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓటు వేయడానికి ప్రజలు బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు లేకపోవడంతో అధికారులు, ప్రజలు కూడా చాలా ఇబ్బందులుపడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి శ్రేణులు, వైసీపీ నాయకులు తమ అభ్యర్థులకు ఓట్లు వేయించడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. 225, 227 కేంద్రాల్లో ఈవీఎంలు సరిగా పని చేయలేదు. కొన్ని కేంద్రాల్లో రాత్రి 6 గంటలైనా ఓటర్లు క్యూలైన్‌లో నిల్చున్నారు. లక్ష్మీనగర్‌లో కూడా ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో అక్కడ కూడా ఓటింగ్ ఆలస్యంగా జరిగింది. దీంతో ఓటర్లు క్యూలో ఉంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 27వ వార్డులో 232 పోలింగ్ బూత్‌లో ఓటర్లు, పోలింగ్ సిబ్బంది మధ్య తోపులాట జరిగింది. వద్ధులను, వికలాంగులను ఆటోలు, ద్విచక్రవాహనాల్లో పిలుచుకుని వచ్చి ఓటు వేయిస్తున్నారు. కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుండగా ఈ విషయం తెలుసుకున్న సిఐలు సుబ్రమణ్యం, అశోక్‌మార్ సిబ్బందితో వెళ్లి అక్కడి నుండి వారిని పంపించారు. పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తనిఖీలు చేపట్టారు. పలు కేంద్రాల్లో కూటమి శ్రేణులు, వైసీపీ ఏజెంట్ల మధ్య చిన్నచిన్న గొడవలు జరిగాయి. వైసిపి అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు, కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షించారు.201పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కేతిరెడ్డివెంకటరామిరెడ్డి, 219 పోలింగ్ కేంద్రంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పట్టణంలోని 243 పోలింగ్ కేంద్రంలో, 193 పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కదిరిలో ఓటేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

ధర్మవరంలో ఓటర్లకు సహకరిస్తున్న పోలీసులు

బత్తలపల్లి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు పోలీసు సిబ్బంది రాజకీయ పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మండల వ్యాప్తంగా చెదురు ముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 42 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 32,657 మంది ఓటర్లు ఉన్నారు. సాయంకాలం 6 గంటల వరకు 27,201 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 83 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస నాయక్ తెలిపారు. మండలంలోని డి.చెర్లోపల్లి, దంపెట్ల, ఎం. చెర్లోపల్లి, వెంకటగారిపల్లి గ్రామాలలో స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు కేంద్ర బలగాలతో ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఉదయాన్నే వాతావరణం అనుకూలించడంతో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటు హక్కును వినియోగించడానికి ఓటర్లు పోటెత్తారు. మధ్యాహ్నం నుండి సాయంకాలం వరకు ఓటర్ల సందడి తక్కువగా కన్పించింది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారు.

ఓబుళదేవరచెరువు : మండల వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం నమోదయింది. పల్లెల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రజాస్వామ్యపరంగాఓటు వినియోగించు కోవడం తమకు సంతోషంగా ఉందని ఓటర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కొత్తచెరువు రూరల్ : మండల వ్యాప్తంగా 38 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటల నుండి సాయంకాలం 6 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించారు పోలింగ్ జరిగిందని ఎన్నికల అధికారులు తహశీల్దార్ కళావతి, ఎంపీడీవో సిద్దారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కేసాపురం మరకుంటపల్లి, నారేపల్లి, కోడప గాని పల్లి, ఈ గ్రామాలలో సమయం ముగిసిన కూడా ఓటర్లు క్యూలో ఉన్నందున పోలింగ్ కొనసాగించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా మహిళలు వద్దులు వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చిలమత్తూరులో ఉద్రిక్తత

వైసిపి టీడీపి వర్గీయుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

దాడిలో గాయపడిన బాబురెడ్డి

చిలమత్తూరు మండల పరిధిలో మూడు పోలింగ్ స్టేషన్ల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొత్తచామల పల్లి, కనిశెట్టిపల్లి, హుస్సేన్ పురంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. హుస్సేన్ పురంలో జరిగిన ఘటనలో వైసిపి కి చెందిన నవీన్ కుమార్, టీడీపికి చెందిన బాబురెడ్డి కి రక్త గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న డిఎస్పీ కంజక్షన్ ఆధ్వర్యంలో పోలీసులు గొడవను సద్దుమణిచారు. ఎంపిపి పురుషోత్తమ రెడ్డి,టీడీపికి చెందిన బాబురెడ్డికి ముందు నుండి పాత కక్షలు ఉన్నాయి. గత ఎన్నికల ప్రచార సమయంలో అక్కడ గొడవ జరిగింది. అయితే తాజాగా పోలింగ్ బూత్ వద్ద ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న నేపథ్యంలో వైసిపి టిడిపిల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపి కి చెందిన బాబు రెడ్డి, వైసిపికి చెందిన నవీన్ కుమార్ లకు గాయాలు కాగా అంబులెన్స్ సహాయంలో పోలీసులు హిందూపురం ఆసుపత్రి కి తరలించారు. జరిగిన ఘటన పై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని డీఎస్పీ కంజక్షన్,సిఐ ఈరన్న, ఎస్ఐ గంగాధర్ తెలిపారు. కాగా కొత్తచామలపల్లి బూత్ లో పోలింగ్ అధికారి వైసిపి కి ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని టిడిపి ఏజెంట్లు ఆందోళనకు దిగారు. దీంతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, తహశీల్దార్ భాగ్యలత అక్కడికి చేరుకొని గొడవను సద్దుమణిపారు. ఇక కనిశెట్టిపల్లి గ్రామంలోను టిడిపి వైసిపిల మధ్య ఘర్షణ జరిగింది. ఇలా అక్కడక్కడ చెదురుముదురు ఘటనలు చోటు చేసుకున్నాయి.

దాడిని ఖండించిన బాలయ్య

చిలమత్తూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని నందమూరి బాలక్రిష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తపై వైసిపి వర్గీయుల దాడిని ఖండిస్తున్నామన్నారు. అలాగే వైసిపి కార్యకర్త నవీన్ కుమార్‌ని వైసిపి అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి పరామర్శించారు. నియోజక వర్గంలో వైసిపి గెలవబోతుందన్న అక్కసుతోనే వైసిపి కార్యకర్తలపై దాడి చేశారని ఆయన విమర్శించారు.

పుట్టపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం వైసీపీ అభ్యర్థి తన స్వగ్రామమైన నల్ల జింగయ్య గారి పల్లె లో దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తన కుటుంబంతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి ఆమె భర్త వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మున్సిపాలిటీ పరిధిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దంపతులు పట్టణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి తన సొంత గ్రామమైన అమడగూరు మండలం ఏ కొత్తపల్లిలో తమ ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వినియోగించుకున్నారు.

మొదటి పేజి తరువాయి

ఓటరోత్సాహం..!

ఎదురపడటంతో మళ్లి అదే తీరు కొనసాగింది. పోలీసులు చెదరగొట్టారు. గుత్తిలో టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన సమయంలో వైసిపి నాయకులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత నెలకొంది. రాప్తాడులోనూ కొన్ని చోట్ల పరిటాల శ్రీరామ్, టిడిపి నాయకుడు ఎల్.నారాయణచౌదరిని వైసిపి నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బ్రహ్మసముద్రం మండలంలోనూ వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

సత్యసాయి జిల్లాలోనూ సజావు

సత్యసాయి జిల్లాలోనూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయి. ఇక్కడి ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. మడకశిర, పుట్టపర్తిలో అయితే తరువాత పోలింగ్ ఊపందుకుంది. సత్యసాయి జిల్లాలో 14,06,204 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా 74.98 శాతం పోలింగ్ జరిగింది. రాత్రి 9 గంటల తర్వాత కూడా ఇంకా కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ నడుస్తూనే ఉంది. తుది సమాచారం అందాల్సి ఉంది.

పలుచోట్ల ఉద్రిక్తతలే

సత్యసాయి జిల్లాలోనూ కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలోని హుస్సేనాపురంలో వైసిపి, టిడిపి వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ దాడుల్లో టిడిపి వర్గీయుల్లో ఒకరికి, వైసిపి వర్గీల్లో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు చెదరగొట్టారు. కన్నేసముద్రంలో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ముదిగుబ్బ మండలంలోని జొన్నలకొత్తపల్లి గ్రామంలోనూ వైసిపి, కూటమి వర్గీయుల మధ్య పర్సరం తోపులాట జరిగింది. ఇవి మినహా పెద్దగా సమస్యలు ఎక్కడా తలెత్తలేదు. సజావుగా పోలింగ్ జరిగింది. ఎక్కడా పోలింగ్ ఆగిన దాఖలాలు సత్యసాయి జిల్లాలోనూ లేవు.

తాడిపత్రిలో ఉద్రిక్తం

టిడిపి నాయకులు ఒక్కసారిగా రాళ్లదాడి చేసి వాహనాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఓంశాంతి నగర్ వద్దకు వెళ్లారు. అప్పటికే మిద్దెలపై ఉన్న టిడిపి నాయకులు ఎమ్మెల్యే వాహనంపై కూడా రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఎమ్మెల్యేతో పాటు ఉన్న ఇద్దరు వ్యక్తులు, ఎమ్మెల్యే తనయుడుతో ఎటు ఒకరు, కానిస్టేబుల్ రాళ్ల దాడిలో గాయపడ్డారు. రాళ్లదాడితో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది.

రంగంలోకి దిగిన ఎస్పీ అమిత్‌బర్దర్

తాడిపత్రిలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఘర్షణ విషయం తెలుసుకున్న ఎస్పీ అమిత్ బర్దర్ వెంటనే సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఘర్షణలకు దిగొద్దంటూ ఇరు వర్గాలను హెచ్చరించే ప్రయత్నం చేశారు. ఆయన హెచ్చరికలు చేస్తుండగానే మరోసారి ఇరు వర్గాలు రెచ్చిపోయి రాళ్లదాడులు చేసుకున్నారు. ఈ సమయంలో కొందరు ఎస్పీపై కూడా రాళ్లు విసిరారు. ఈ దాడి నుంచి ఎస్పీ తటిలో తప్పించుకున్నారు. వెంటనే అదనపు పోలీసుల బలగాలు రప్పించి అక్కడున్న వారందరినీ ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించారు. పోలింగ్‌కు సంబంధం లేని వారందరినీ అక్కడి నుంచి పంపించి ఆ ప్రాంతాన్ని పోలీసులు వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కాగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి పట్టణంలోని ట్రైలర్స్ కాలనీలోని ప్రకాశం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించడానికి వెళ్తుండగా మరోసారి టిడిపి నాయకులు ఎమ్మెల్యే వాహనంపై రాళ్లు రువ్వారు. పట్టణంలో జరిగిన దాడిపై ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్ రెడ్డి టిడిపి నాయకుల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జెసికి కొందరు పోలీసులు సహకరిస్తున్నారు..

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిలో జరిగిన ఘటనపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. పోలింగ్ సందర్భంగా జెసి.ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జెసి.అస్మిత్ రెడ్డిని గెలిపించేందుకు అడిషనల్ ఎస్పీ రామకృష్ణ సహకారం అందిస్తున్నారని చెప్పారు. జెసి ప్రభాకర్ రెడ్డి, అస్మిత్ రెడ్డి అనుచరులు 70 బైకులతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఏఎస్పీ రామకష్ణ విషయాలన్నీ తమకు తెలుసునని త్వరలోనే ఆయన లెక్కలు తేలుస్తామన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి కావాలనే తాడిపత్రిలో ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారన్నారు.

ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణలు

పోలింగ్ ప్రారంభమైన గంటల వ్యవధిలో తాడిపత్రి మండలంలోని వంగనూరు, బొడాయిపల్లి గ్రామాల్లో టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణలు జరిగాయి. బొడాయిపల్లి గ్రామంలో జరిగిన ఘర్షణలో టిడిపి కార్యకర్త తలపగిలింది. ఆయా గ్రామాల్లో పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
మంగళవారం 14
మే 2024

ఓటెత్తారు..!

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.. దానిని బాధ్యతతో వినియోగించుకోవాలనే విషయాన్ని ప్రజలు పాటించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటు వినియోగించుకునేందుకు అనంత జిల్లా ప్రజలు ఓటెత్తారు. యువత, మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఇలా అందరూ వారి ఓటును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లో ప్రజలు బారులుదీరారు. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించగా సిబ్బంది స్పందించి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయనే చెప్పాలి.

ప్రజాశక్తి యంత్రాంగం-
అనంతపురం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా చూస్తున్న కలెక్టర్

ఓటు వేయడానికి బారులు తీరిన మహిళా ఓటర్లు

రాప్తాడులో ఓటర్లకు నమస్కరిస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

తాడిపత్రిలో అల్లరి మూకలను చెదరగొడుతున్న ఎస్పీ

చిన్నారితో కలసి ఓటు వేయడానికి వచ్చిన ముస్లిం మహిళ

పుటపర్తి నియోజకవర్గంలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించి బయటకు వస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అనంతపురంలో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ పోలింగ్‌కేంద్రం ముందు ముగ్గు వేసిన దృశ్యం

ఓటు వేయడానికి వృద్ధురాలిని మోసుకుని వస్తున్న కుటుంబసభ్యుడు

ఓటు వేయడానికి వేచి ఉన్న ఓటర్లు

పోలింగ్‌కేంద్రానికి వృద్ధురాలని వీల్‌ఛైర్‌లో తీసుకుని వస్తున్న కుటుంబసభ్యులు

తన ఓటు మరొకరు వేశారని చెబుతున్న చిలమత్తూరు మండలానికి చెందిన ఓటరు

రాయదుర్గంలో పోలింగ్‌కేంద్రం వద్ద వృద్ధురాలికి మాత్రలు ఇస్తున్న వైద్యసిబ్బంది

గుంతకల్లులో ఓటు వేయడానికి వెలుతున్న వృద్ధురాలు

చిలమత్తూరు మండలంలో మొరాయించిన ఇవిఎం స్థానంలో మరొక ఇవిఎంను అమర్చుతున్న అధికారులు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పోలింగ్ ప్రశాంతం : ఎస్పీ

ముదిగుబ్బ : నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఓటర్లు, సిబ్బంది సహాయ సహకారాల వలన సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పార్లమెంటు, శాసనసభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మూడు పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను, బందోబస్తును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు, సమస్యాత్మక కేంద్రాలలో ప్రత్యేక నిఘా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెదురు మొదలు సంఘటనలు మినహా జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా అన్ని సమసాత్మకమైన, పోలింగ్ కేంద్రాలను, ఓటింగ్ సరళిని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి సోమవారం పరిశీలించారు. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, సికేపల్లి, కనగానపల్లి, రామగిరి, ముదిగుబ్బ, బత్తలపల్లి తదితర సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఈవీఎం బాక్సులను స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేర్చు వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకొని అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రాయదుర్గం : రాయదుర్గం పట్టణ పొలిమేరలో బిటి ప్రాజెక్ట్ రోడ్డు మోడల్ కాలనీ ఈశ్వర దేవాలయం సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మతి చెందాడు. గుమ్మఘట్ట మండలంలోని 75-వీరాపురం గ్రామానికి చెందిన రాజు(35) గ్రామంలో ఓటు వేసి, భార్య, కుమారుడితో కలిసి వీరాపురం నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఈశ్వర దేవాలయం సమీపంలో అదుపుతప్పి రాయదుర్గం నుంచి పూలకుంట వెళున్న టెంపో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఓబుళదేవరచెరువు : మండలపరిధిలోని కుసుమవారిపల్లెలో ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాతకక్షలతో వైసిపి టిడిపి సానుభూతిపరులు గొడవకు దిగారు. ఈ క్రమంలో వైసిపి చెందిన ఇంద్రప్ప అనే వ్యక్తిపై టిడిపికి సానుభూతిపరుడు రంగప్ప కత్తితో పొడిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధ్యతను బంధువులు నిందితుడిని తమకు అప్పగించకుండా స్టేషన్‌కు తీసుకురావడం, మాపైనే లారీఛార్జి చేయడం ఏంటని పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరు అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ వంశీకృష్ణ హెచ్చరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. గాయపడ్డ వ్యక్తి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న యువత

రొద్దం : మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో యువతీ, యువకులు పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో ఒకే కుటుంబంలో ముగ్గురు యువతులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. తాము తొలిసారిగా ఓటు వేయడం ఎంతో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

'పురం'లో సార్వత్రిక సంగ్రామం ప్రశాంతం

మందకొడిగా ప్రారంభమై పుంజుకున్న పోలింగ్ శాతం

ప్రజాశక్తి-హిందూపురం

18వ సార్వత్రిక సంగ్రామం సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని హిందూపురం పురపాలక సంఘం రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు కలిపి 2,49,174 మంది ఓటర్లు ఉండగా అధికారులు 253 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 6 గంటలకే పోలింగ్ అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ప్రారంభంలోనే 40వ

ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న బాలకృష్ణ

బూత్‌లో ఈవిఎం 1 గంటకు పైగా మొరాయించడంతో అక్కడ పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అక్కడక్కడ ఈవిఎంలు మొరాయించి మందకొడిగా ఓటింగ్ ప్రారంభం కాగా ఉదయం 9 గంటలకు 9.52 శాతం పోలింగ్ నమోదు కాగా అనంతరం ఒక్కసారిగా పుంజుకుంది. సాయంత్రం 4 గంటలకు 60.36 శాతం, 6 గంటలకు 73.32 శాతం నమోదైంది. 6 గంటకు పోలింగ్ ముగిసినప్పటికీ చాలా ప్రాంతాలలో ఓటర్లు క్యూలో నిల్చుని ఉండడంతో నిర్ణయించిన సమయానికి పోలింగ్ పూర్తి కాలేదు. దీంతో అధికారులు అదనపు సమయం ఇచ్చారు. పట్టణంలో సాయంత్రం వర్షం కురిసింది. మోడల్ కాలనీలోని పోలింగ్ బూత్‌లు-78, 79 వద్ద ఓటర్లు వర్షంలోనే క్యూలో నిలబడి ఓట్లు వేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్ ఛైర్లు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తానికి సార్వత్రిక సంగ్రామం చిలమత్తూరు మండలం మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సరళిని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ, వైసిపి నాయకులు వేణురెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఎంహెచ్

ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఇనాయతుల్లా, స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామితో పాటు బరిలో ఉన్న అభ్యర్థులు పరిశీలించారు. బాలకృష్ణను చూడడానికి ఓటర్లు ఎగబడ్డారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిర్వహణ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిలమత్తూరు మండలం వీరాపురం, హుస్సేన్ పురంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య గొడవలు జరిగాయి. నియోజకవర్గంలో 253 పోలింగ్ బూత్‌లకు 32 రూట్‌లను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఈవిఎంలు మొరాయిస్తే మార్చడం కోసం ప్రతి రూట్ అధికారికి అదనపు ఈవిఎంలను అందించారు. అయితే ఎన్నికల నిర్వహణలో భాగంగా అక్కడక్కడ ఈవిఎంలు మొరాయించినప్పటికీ వాటితోనే ఎన్నికలను నిర్వహించడంతో పోలింగ్ కాస్త ఆలస్యమైంది. పోలీసు అధికారులు ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. 200 మీటర్ల వరకూ ఇతరులను అనుమతించలేదు.

'పురం'లో ఓటర్ల సందడి

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం హిందూపురం పట్టణంలోని వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ప్రముఖులు కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురపాలక సంఘంలోని మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్-42లో సిట్టింగ్ ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ సతీమణి వసుంధరదేవితో కలిసి ఓటు వేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పవిత్రమైన సాధనం ఓటు అని, ఆ ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజలందరూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఓటు వేయాలన్నారు. మీ కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. రూరల్ మండలం బేరేపల్లి పంచాయితీ 10వ నెంబరు పోలింగ్ బూత్‌లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, ఆమె భర్త, వైసిపి నేత

ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న ఇక్బాల్, నవీన్ నిశ్చల్

వేణురెడ్డి ఓటు వేశారు. ఆబాద్‌పేటలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంహెచ్.ఇనాయతుల్లా కుటుంబ సమేతంగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఐజి, మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఓటు వేశారు. ఎపి ఆగ్రోస్ ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఓటు వేశారు. అలాగే ఇతర ప్రముఖులు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ ప్రక్రియను నిలిపివేయడంతో ఖాళీగా కుర్చున్న ఓటర్లు

మాక్ పోలింగ్ ఓట్లు తొలగించకుండానే..

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని పాత హడగలి గ్రామంలోని పోలింగ్ బూత్-34లో 97 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటలకు అధికారులు 50 ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహించారు. అయితే వాటిని తొలగించకుండానే పోలింగ్ చేయడంతో 104 ఓట్లు పోలయ్యాక ఓటింగ్ నిలిపివేశారు. వాస్తవానికి 104 మంది ఓటర్లు ఓటు వేయగా మాక్ పోలింగ్‌లో వేసిన 50 ఓట్లను తొలగించకపోవడంతో 154 గా నమోదైంది. దీంతో కొద్దిసేపు ఓటింగ్ నిలిపివేశారు. పోలింగ్ పూర్తయిన అనంతరం మాక్ పోలింగ్‌కు సంబంధించిన 50 ఓట్లను తొలగిస్తామని అధికారులు చెప్పగా ఏజెంట్లు అంగీకరించడంతో తిరిగి పోలింగ్‌ను కొనసాగించారు. ఈ కేంద్రంలో పోలింగ్ ముగిసే సమయానికి 543 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 97శాతంగా నమోదైంది.

పెనుకొండలో ఓటు వేసిన ప్రముఖులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని శాంతి నికేతన్ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలిం చారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్‌రెడ్డి తో కలిసి గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఉషశ్రీచరణ్ దంపతులు వేర్వేరుగా నియోజకవర్గం లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పెనుకొండ పట్టణంలోని సెంట్రల్ స్కూల్, బోయపేట, గుట్టూరు పోలింగ్ కేంద్రాలను హిందూపురం టిడిపి ఎంపి అభ్యర్థి బికె.పార్థసారథి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పెనుకొండ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పట్టణ ప్రముఖులు ఓటు హక్కు

సిరా గుర్తు పెట్టించుకుంటున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్



ఓటు వేసిన తర్వాత సిరా గుర్తు చూపిస్తున్న శిల్ప, భాస్కర్‌రెడ్డి

వినియోగించుకున్నారు. శ్రీ షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప, ఆమె తండ్రి భాస్కర్‌రెడ్డి, బాబయ్యస్వామి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా తదితరులు ఓటు వేశారు. సోమందేపల్లి మండలం మేకలపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కురుబ కృష్ణమూర్తి దంపతులు, బ్రహ్మసముద్రం గ్రామంలో బ్రహ్మసముద్రం శ్రీనివాసులు, తదితరులు వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సజావుగా పోలింగ్

బొమ్మనహాల్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా పోలింగ్ సజావుగా జరిగింది. మండలంలో మొత్తం 54 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా 70 శాతం ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ రామాంజనమ్మ తెలిపారు. సింగేపల్లి, శ్రీధరఘట్ట, బొమ్మనహాల్ గ్రామాల్లో కొంత ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఆయా బూత్‌లలో ఓటర్లు కొంత సమయం క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినహా అన్నిచోట్లా పోలింగ్ సజావుగా సాగింది. శ్రీధరఘట్ట గ్రామంలో వీల్‌ఛైర్లు అందుబాటులో లేని కారణంగా వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను పోలీసులు చేతుల మీద ఎత్తుకొని వచ్చి ఓటు వేయించారు. వలస వెళ్లిన కూలీలు, పట్టణాల్లో నివాసం ఉంటున్న ఉద్యోగులు, వ్యాపారులు సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా స్వగ్రామం వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నడవలేని మహిళకు ఓటు వేసేందుకు అనుమతి నిరాకరణ

హిందూపురం : సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యానికి అనార్యో మహిళ జైబూన్ ఓటు హక్కు ఉన్నా వినియోగించుకో లేకపోయింది. వివరాలు.. పట్టణంలోని రహమత్‌పురం పోలింగ్ బూత్ నెంబరు-89లో జైబూన్‌షేక్‌కు ఓటు ఉంది. అయితే ఈమె అనారోగ్యం కారణంగా మంచానికే పరమితమైంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి ఎన్నికల సంఘం వికలాంగులు, వృద్ధులకు హోం ఓటింగ్ కల్పించి వంద శాతం ఓటింగ్ నమోదు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక సచివాలయ ఉద్యోగులు అలాంటి వారిని గుర్తించి హోం ఓటింగ్‌కు ఎంపిక చేసి, వారితో హోం ఓటింగ్ చేయాల్సి ఉంది. అయితే రహమత్ పురంలో పోలింగ్ బూత్ నెంబర్-89లో జైబూన్‌షేక్ ఓటు వేయడానికి కుటుంబ సభ్యుల సాయంతో ఆటోలో వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు ఓటు హక్కు కల్పించడానికి అధికారులు నిరాకరించారు. దీంతో ఆమెకు ఓటు హక్కు ఉన్నా వేయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది.

ఓటు వేయడానికి ఆటోలో పోలింగ్ బూత్‌కు వచ్చిన జైబూన్

మీడియాతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

వైసిపి గెలుపు ఖాయం

రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం : రాయదుర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ స్థానాల్లో వైసిపి అభ్యర్థుల గెలుపు ఖాయమని ఆ పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని కోతిగుట్ట వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో సోమవారం మెట్టు కుటుంబ సభ్యులతో పాటు ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం రాత్రి మంచి వర్షం కురిసిందని ఇది శు భ సూచకం అన్నారు. తాను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు తిరిగానని, గ్రామాల్లో కూడా ప్రజల్లో సానుకూల స్పందన ఉందన్నారు. మంచి మెజారిటీతో గెలుస్తానని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి విజయం సాధించడం ఖాయమని, జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని మెట్టు గోవిందరెడ్డి అన్నారు.

మోరేపల్లిలో వంద శాతం పోలింగ్

కళ్యాణదుర్గం : మండలం మోరేపల్లి గ్రామంలో వంద శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సిబ్బంది తెలిపారు. గ్రామంలో 547 ఓట్లు ఉండగా 545 పోలయ్యాయి. ఇందులో ఒక ఓటు డబుల్ ఎంట్రీ కాగా మరో ఓటరు మృతి చెందినట్లు పిఒ తెలిపారు. గ్రామంలో వంద శాతం ఓట్లు పోల్ కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి-రొద్దం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని బూత్‌లలో ఓటర్లు ఎక్కువగా ఉండడంతో సాయంత్రం 6 గంటలైనా క్యూ లైన్‌లో బారులు తీరారు. ఉదయం గోనమేకలపల్లి గ్రామంలో, 4 గంటల సమయంలో కమ్మలపల్లి గ్రామంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య చిన్న చిన్న గొడవలు చేసుకోగా అప్రమత్తమైన ఎస్ఐ వలిబాషా ఎప్పటికప్పుడు గొడవలను అణచివేశారు. ఉదయం పెనుకొండ సిఐ యుగంధర్ రొద్దం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బందోబస్తు సిబ్బందికి సూచించారు. మొత్తంగా అక్కడక్కడ చిన్న చిన్న గొడవలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

అవస్థలు పడిన ఓటర్లు

1000, 1500 మంది ఓటర్ల ఉన్న బూత్‌లలో సాయంకాలం 6, 7 గంటలైనా ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. ప్రధానంగా సానిపల్లి, కంబాలపల్లి, కంచిసముద్రం, తదితర గ్రామాల్లో ఓటర్లు తీవ్ర అవస్థలు పడ్డారు. చాలా బూత్‌లలో పోలీసులను తక్కువగా కేటాయించడంతో వారు ఓటర్లను అదుపు చేయలేక నానా అవస్థలు పడ్డారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలు ఉన్న తల్లులు ఓట్లు వేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఓటు వేసిన హిందూపురం టిడిపి ఎంపీ అభ్యర్థి బి కే పార్థసారథి

హిందూపురం టిడిపి ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారథి ఉదయాన్నే తన సొంత గ్రామం ఆర్.మరవపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేటితో అరాచక పాలనకు చరమగీతం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో ఐదేళ్ల వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు ఓటర్లు నేడు చరమగీతం పాడారని టిడిపి రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని 7వ ఎన్నికల వార్డులోని పోలింగ్ కేంద్రంలో సోమవారం కాలవ శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో పాటు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చేందుకు సిద్ధమయ్యాం న్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉదయం నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను ధ్వంసం చేసి అభివృద్ధిని పూర్తిగా విస్మరించి సంక్షేమంలో కోతలు విధించి ప్రజలను నానా ఇబ్బందులు పెట్టిన జగన్ విధ్వంసకారుడని ప్రజాస్వామ్యా న్ని పూర్తిగా నాశనం చేశారన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నరేంద్రమోడీ ఎన్‌డిఎ కూటమిగా ఏర్పడినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో 160కి పైగా స్థానాల్లో ఎన్‌డిఎ గెలుపు సాధించి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. రాయదుర్గంలో కూడా ప్రజలు ఉదయం నుంచి ఉత్సాహంగా క్యూలైన్లలో బారులు తీరారన్నారు. ఓటర్లు వైసిపిని ఓడించేందుకు, టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎం చేసేందుకు పట్టుదలగా ముందుకు వచ్చారన్నారు. రాయదుర్గంలో తాను 50 వేల ఓట్ల పైచిలుకు మెజారిటీ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లలో రాయదుర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిని చేస్తానని, అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో రాయదుర్గాన్ని బాగు చేసేందుకు శ్రమిస్తానని కాలవ శ్రీనివాసులు చెప్పారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

మీడియాతో మాట్లాడుతున్న టిడిఎ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

మడకశిర నియోజకవర్గంలో 74.25 శాతం పోలింగ్

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురు ముదురు సంఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పోలింగ్ నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకూ 74.25 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు క్యూ లైన్‌లో నిల్చున్న వారికి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ కంటే ఈసారి అధిక శాతం పోలింగ్ నమోదైనట్లు రాజకీయ విశ్లేషకులు తెలియజేస్తున్నారు. సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తన స్వగ్రామం నీలకంఠాపురంలో, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్ తన స్వగ్రామం కరికెరలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిర పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న అమరాపురంలో, మాజీ మంత్రి హెచ్‌బి నరసయ్యగౌడ్ రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సార్వత్రికల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న గుండుమల కుటుంబ సభ్యులు

కిరికెరలో ఎన్నికల బహిష్కరణ

కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని రోడ్డుపై బైఠాయింపు.. వైసిపి నాయకుల హామీతో ఓటేసిన ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కిరికెర బసవన్నపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పోలింగ్ బూత్-136, 137కు చెందిన భరత్‌నగర్, ఇందిరమ్మ కాలనీలకు చెందిన దాదాపు 500 మంది ఓటర్లు ఎన్నికలను బహిష్కరించారు. తమ కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించలేదని నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ స్థాయి నాయకులు అక్కడికి చేరుకుని వారికి నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. ముఖ్య నాయకులు వచ్చి మా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చేంత వరకూ ఓటు వేయడానికి కదిలేది లేదని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు రాము అక్కడికి చేరుకుని తాము అధికారంలో లేకపోవడంతోనే మీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని, తప్పకుండా వచ్చేది మా ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. దీనిపై కాలనీ వాసులు మాట్లాడుతూ మీరు అధికారంలో ఉన్న సమయంలో చేసిందేమిటని ప్రశ్నించగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం సర్పంచి భర్త మూర్తి అక్కడికి వచ్చి ఆయా ప్రాంతాల వారికి నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేశారు. సర్పంచిగా గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్నో సమస్యలను మీ దృష్టికి తీసుకొచ్చామని, అందులో ఏ ఒక్కటైనా పరిష్కరించారా అని నిలదీశారు. తమ కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, తదితర కనీస సదుపాయాలు, రేషన్‌షాపులు, అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోలేదన్నారు. మీ పదవీకాలం పూర్తయ్యే లోపు మా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తే మీకు సహకరిస్తామన్నారు. దీంతో ఏమి చెప్పాలో తెలియక సర్పంచి భర్త మూర్తి సైతం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు కూడా స్పందించలేదు. మధ్యాహ్నం వరకూ వారు ఓటు వేసేందుకు వెళ్లలేదు. చివరకు వైసిపి ముఖ్య నాయకులు అక్కడికి చేరుకొని తాము అధికారంలోకి రానీ రాకపోనీ గ్రామ సర్పంచి వైసిపి మద్దతుదారుడు కావడంతో తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారందరూ ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌లకు వెళ్లారు.

సర్పంచి భర్త మూర్తిని నిలదీస్తున్న కాలనీవాసులు

పోలింగ్ బూత్‌లో గుర్తింపుకార్డు చూపుతున్న ఆర్ఒ రాణి సుస్మిత

కళ్యాణదుర్గంలో ఓటేసిన ప్రముఖులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సార్వత్రిక ఎన్నికల్లో పలువురు ప్రముఖులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఆర్ఒ రాణిసుస్మిత 68వ బూత్‌లో ఓటు వేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య ఓటు హక్కును వినియోగించుకు న్నారు. అనంతరం సురేంద్రబాబు నియోజకవర్గ పరిధిలోని 34 సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. బెస్తరపల్లి, వైసి.పల్లి, కైరేవు, వేపులపర్తి, మలయనూరు గ్రామాల్లో వైసిపి నాయకులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా స్థానిక టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆయా గ్రామాల్లో చోటుచేసుకున్న చెదరు ముదురు సంఘటనలపై టిడిపి అభ్యర్థి సురేంద్రబాబు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. కంబదూరు మండలంలోని వైసి.పల్లి ఓ బూత్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న నిరంజన్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని బహిరంగంగా ప్రచారం చేయడంతో అక్కడున్న టిడిపి ఏజెంట్లు, అధికారులు బయటి బయటకు పంపారు. దీంతో అక్కడ కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

వెంకటంపల్లిలో పోలీసుల లాఠీఛార్జ్

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వెంకటంపల్లిలో ఓటర్ల కోసం రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా బూత్‌ల పరిధిలో మొత్తం 2,300 ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు క్యూ లైన్లలో నిలబడలేక, కూర్చోలేక చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఓటర్లు తోసుకోవడంతో గందరగోళం నెలకొంది. అయితే ఓటర్లకు సర్ది చెప్పాల్సిన పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో చాలా మంది ఓటర్లు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. అయితే ఆయా పార్టీల నాయకులు తిరిగి వెళ్లిన ఓటర్లను బుజ్జగించి పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి ఎలాగోలా ఓట్లు వేయించారు.

రాత్రి 7 గంటల వరకు ఓటింగ్

ప్రజాశక్తి-లేపాక్షి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల వ్యాప్తంగా ఓటు వేయడానికి ఓటర్లు రాత్రి 7 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. మొత్తం 36,167 మంది ఓటర్లు ఉండగా 42 బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. లేపాక్షి, చోళసముద్రం, కంచిసముద్రం పంచాయతీల్లో చిన్న చిన్న గొడవలు జరిగాయి. కానీ ఓటింగ్‌కు ఎలాంటి అవాంతరాలు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఓ పోలింగ్ కేంద్రంలో రెండు బూత్‌లు దగ్గర దగ్గరగా ఏర్పాటు చేయడంతో ఓటర్లు తోసుకొన్నారు. చోళసముద్రం గ్రామంలో ఇరు పార్టీల మధ్య చిన్న పాటి ఘర్షణలు జరిగాయి. విషయం తెలుసుకొన్న డీఎస్పీ కంజాక్షన్, ఎస్ఐ గోపి పోలీసు సిబ్బందితో పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని ఇరు పార్టీల వారిని చెదరగొట్టారు. హిందూపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణనందస్వామి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ ఈరన్న, ఎస్ఐలు గోపి, ప్రదీప్‌కుమార్ గట్టి బందోబస్త్ నిర్వహించారు.

ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

ఓటేసిన అభ్యర్థులు

ఓటేసిన అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి కుటుంబం

టిడిపి అభ్యర్థి దగ్గుపాటి దంపతులు

నందమూరి బాలకృష్ణ దంపతులు

దీపిక

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లికార్జున కుటుంబం


శంకరనారాయణ

బండారు శ్రావణిశ్రీ, అక్క

వీరాంజనేయులు

వై.విశ్వేశ్వరరెడ్డి దంపతులు

పయ్యావుల కేశవ్

కందికుంట వెంకటప్రసాద్ దంపతులు

ఉషశ్రీచరణ్ దంపతులు

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఎన్.రఘువీరారెడ్డి కుటుంబం

కాలవ శ్రీనివాసులు కుటుంబం

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు

రంగన అశ్వర్థనారాయణ కుటుంబం

సవితమ్మ

పల్లె రఘునాథరెడ్డి కుటుంబం

సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు దంపతులు

అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు


తాజా మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

పోలింగ్ సిబ్బందిపై బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులపై టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలనకు వచ్చిన ఆమె పోలింగ్ కేంద్రంలో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు వేయడానికి ఇవిఎంలు పెట్టిన బాక్సులపైన అభ్యర్థులను సూచించే విధంగా స్టిక్కరింగ్ వేయలేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో చాలామంది ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఆమెతోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, మాజీ ఎంపిపి ఆకుల అరుణ, టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల బాబు, ప్రతాప్‌చౌదరి, నాగార్జుననాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'అనంత అర్బన్'లో 64.3 శాతం పోలింగ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ముగిసింది. 50 డివిజన్లు, 4 గ్రామపంచాయతీల పరిధిలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 281214 మంది ఓటర్లకు ఉండగా 179257 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 64.3 శాతం పోలింగ్ నమోదైంది. 7 గంటల నుంచే ఓటర్లు కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ 6గంటల్లోపు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లకు ఓటుహక్కును వినియోగించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. కాగా అనంతపురం టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ దంపతులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈమేరకు రాప్తాడు మండలం బండ్లమీదపల్లి జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం అనంతరం అర్బన్‌లో పోలింగ్ కేంద్రాలను కలియతిరిగి సరళిని పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వైసిపి ఏజెంట్లకు టిడిపి ఏజెంట్లకు మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది.

ఓటింగ్‌కు క్యూలో వెళ్తున్న ఓటర్లు